ఆంధ్రజ్యోతి వీక్లీ & తెలుగుకళా సమితి న్యూఢిల్లీ–రాజ్యలక్ష్మి ఫౌండేషన్
వారి కథల పోటీలో బహుమతి పొందిన కథ

# జయహే



అసుర సంధ్యవేళ మాస్టారింటికి సూర్రెడ్డి అనుచరులొచ్చారు హడావిడిగా.

సూర్రెడ్డి ఆ ప్రాంతపు యమ్మెల్యే. కొద్ది రోజుల క్రిందట జరిగిన మంత్రి వర్గపు మార్పుల్లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తదనంతరం ప్రథమంగా ఆ ప్రాంతాని కొస్తున్నారు. ఆ సందర్భంగా ఆయనకి భారీ ఎత్తున సన్మానం ఏర్పాటు చేశారు. అందు మీదట మంత్రిగారి మీద పద్యరత్నాలు రాయమని కోరడానికొచ్చారు.

సంగతి విని ఎగిరి గంతేశారు మాస్టారు. ఆయన పద్యరత్నాలతో ఆశీర్వదింపబడని గొప్పింటి పెళ్ళి ఆ ఏరియాలో లేదంటే అతిశయోక్తి కాదు.

ఇప్పుడేకంగా మంత్రిగారి సన్మాన సభలో తన పాండిత్యం ప్రదర్శించే అవకాశం వెదుక్కుంటూ వచ్చింది మరి.

మంత్రిగారి చేత పట్టు శాలువాతో సత్కరింపజేస్తామని కూడా చెప్పేరు. దాంతో మాస్టారు వుబ్బితబ్బిబ్బై పోయి ప్రింటింగు పనికూడా తన మీదే వేసుకున్నారు.

"పద్యరత్నాలంటున్నారు ఎవరి కళ్యాణం?" మాస్టారి భార్య నాంచారి అడిగింది.

"కళ్యాణం కాదే సన్మానం. మంత్రి సూర్రెడ్డి గారికి ఘన సన్మానం. మంత్రిగారి మీద పద్యాలు రాయమని వచ్చారే"

"ఏవిటేవిటీ! నిన్న మొన్నటి దాకా కల్లూ సారా అమ్మినాయనకి ఇవాళ పద్య రత్నాలు కావాల్సొచ్చాయా? హవ్వ!" బుగ్గలు నొక్కుకుంది.

"అతడెలాటి వాడైనా కావొచ్చు. కానిప్పుడు మంత్రి. అతడి సన్మాన సభలో పద్య రత్నాలు చదివే అవకాశం రావడం గొప్ప కదూ? పైగా మంత్రిగారి చేత దుశ్శాలువ కప్పి సత్కరిస్తామన్నారు. ఎంత గౌరవమో చూడు. అదీ గాక మంత్రిగారి ప్రాపకం లభిస్తే రేపు పెన్షనూ త్వరగా వస్తుంది. అబ్బాయికి ఉద్యోగమూ లభిస్తుంది"

"సరి సర్లెండి. అవతల కూర మాడిపోతోంది..."

"మంత్రి కటాక్షం అంటే నీకేదో వేళాకోళంగా వున్నట్టుంది. చూస్తూండు, ఎన్ని అద్భుతాలు జరుగుతాయో"

అవాళే పద్య రచనకి శ్రీకారం చుట్టారు మాస్టారు.

వినాయక స్తుతి అయ్యాక కలం ఆగిపోయింది. సూర్రెడ్డి గురించి ఏమని పొగట్టం? పొగడదగిన పనేదీ చేసిన దాఖలాల్లేవు. మరేమని రాయడం?

అది గమనించి నవ్వింది నాంచారి – "నుయ్యి తవ్వితే పొంగివచ్చే నీళ్ళలా కవిత్వం రావాలండీ. పాపం మీరేం చేస్తార్లెండి. ఎడారిలో నుయ్యి తవ్వమన్నారాయె!"

"పెళ్ళిళ్ళకి పద్యాలు రాసి ఆశీర్వదించారంటే అర్థముంది. వాళ్ళెలాటి వాళ్ళైనా చక్కగా కలిసి వుండాలనీ, దేవుడు చల్లగా చూడాలని కోరితే పుణ్యమైనా దక్కుద్ది. ఇదేవిటండీ బలవంతపు బ్రాహ్మణ్యం!" తిరిగి తనే అంది.

"అలాగే అనుకోగాని ఇక నస సరిపెట్టు"

మొత్తానికేరకంగా కుస్తీలు పడితేనేంగాక పది పద్యాలు తయారు చేశారు మాస్టారు. గళమెత్తి పాడారు. చాలా బాగున్నాయని మెచ్చుకుంది నాంచారి.

"కాదన్న నీచేత ఔననిపించా. చూశావా కవి ప్రతిభ?"

"మీర్రాసింది గాంధీగారి మీద అనుకుని విన్నాన్లెండి"

ఖంగు తిన్నారు. అవాక్కై చూశారు. గుంభనంగా నవ్వుతోందామె.

ఎంత సత్యం!

మంత్రి సూర్రెడ్డి ఎలాంటివాడని తను వర్ణించారో ఆ లక్షణాలన్నీ మహాత్ముడివి!

ఒళ్ళు జలదరించిందొక్కసారే. ఎంతో జుగుప్సగా అన్పించి కాగితాల్ని దాచేసి లేచారు.

సన్మానం రోజు రానే వచ్చింది.

పొందూరు ఖద్దరు పంచె, బంగారు వర్ణపు చొక్కా, బిళ్ళంచు పైపంచె ధరించారు మాస్టారు. కరపత్రాలని సంచిలో పెట్టుకుని సభా స్థలికి వెళ్ళారు.

టౌన్ హాలు కొత్త పెళ్ళికూతుర్లా సింగారించుకుంది.

ఎటు చూసినా స్వాగత బ్యానర్లూ విద్యుత్ తోరణాల తళతళలూనూ. జనం చాలామంది వచ్చారు. వస్తున్నారు. ఇహ అటు పోలీసులూ, ఇటు పార్టీ వారూ చేస్తున్న ఆర్భాటానికి అంతే లేదు.

మరికాస్సేపటికి మంత్రిగారొస్తున్నారని ప్రకటించడమూ, మందు గుండు సామాగ్రి పేలడమూ ఒకేసారి జరిగాయి.

గబగబా లోపలి కెళ్ళబోతూ మంత్రించినట్టు ఆగిపోయారు మాస్టారు.

అంతవరకూ ఎక్కడున్నారో ఏమో వరదలా వచ్చేశారు ఆడవాళ్ళు. ఒకళ్ళూ ఇద్దరూ కాదు సుమారు మూడు నాలుగు వందల మంది. కాగడాలు ధరించారు కొందరు. సారా వ్యతిరేక నినాదాలు రాసిన ప్లకార్డులు పట్టుకున్నారు కొందరు.

సంసారాలు కూలుస్తోన్న సారాని నిషేధించాలంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు మహిళలంతా.

బిక్క మొహాలతో నిలబడిపోయారు పోలీసులు ఏం చేయాలో తెలీక-తోచక.

అటు మంత్రీ ఇటు మహిళలూ- ఒకర్నొకరు చూస్తూ!

మంత్రి పళ్ళు నూరారు. మహిళలు గొంతు హెచ్చించారు.

ఇంతలో కొందరాడవాళ్ళు కొన్ని సారా ప్యాకెట్లు తెచ్చి గుట్టగా పోసి నిప్పెట్టారు. భగ్గున భోగిమంటల్లా లేచాయి మంటలు.

కళ్ళెదుట సారా మండుతోంటే తన కుర్చీ కెవరో నిప్పు పెట్టినట్టుగా మండిపడ్డారు మంత్రి సూర్రెడ్డి.

అతడింతటి వాడు కావడానికి క్కారణం అక్షరాలా సారా వ్యాపారం మరి!

అతడ్ని ఎమ్మెల్యే చేసింది నీళ్ళలా పారిన సారా, చందాలిచ్చిన సారా కాంట్రాక్టర్లూనూ. అతడు మంత్రి కావడానిక్కారణం సారా సిండికేట్.

కోపోద్రిక్తుడై పోలీసు అధికారుల వంక చూశారు.

కళ్ళతో ఆదేశాలిచ్చారు వాళ్ళు.

మహిళల మీద లాఠీలు స్వైర విహారం చేశాయి.

హాహాకారాలూ, ఆర్తనాదాలూ, తిట్లూ, శాపనార్థాలూ ప్రతిధ్వనించాయి.

కొందరు కూలబడ్డారు. చాలా మంది చెదిరిపోయారు.

ఒగురుస్తూ పోలీసులు సెల్యూట్ చేశారు.

గర్వంగా తలపంకించి ముందుకు నడిచారు మంత్రి సూర్రెడ్డి.

మాస్టారు మాత్రం ఒంటరిగా నిలబడిపోయారు.

కళ్ళముందేవేవో మసగ్గా దృశ్యాలు... సజీవ చిత్రాలు...

తాగివచ్చి అల్లరి చేస్తున్న బావగారు– దీనంగా వేడుకొంటున్న చెల్లెలు– దిగజారిన అతడి ఆరోగ్యం– శుష్కించిన చెల్లెలు– బిక్కు బిక్కుమని చూస్తున్న పిల్లలు. వీధిన పడ్డ సంసారం– అప్పుల వాళ్ళ ఒత్తిళ్ళు– బంధుమిత్రుల చీదరింపులు– సారాకి ఆహుతైన బావగారు– దారిద్ర్యాన్ని భరించలేక పిల్లల్తో సహా నూతిలో దూకి ఆత్మహత్య చేసుకున్న చెల్లెలు...!

"మాస్టారు వెంటనే స్టేజి మీదకొచ్చి పద్య రత్నాలు చదవాల్సిందిగా కోరుతున్నాం..."

మైకులోంచి అధ్యక్షులవారి విన్నపం మార్మోగింది.

మాస్టారు నడిచారు–

లోపలికి కాదు– బయటికి– రోడ్డుమీదకి. సారాసురకాష్ఠం కాలుతున్న చోటుకి!

మంటలో తాను రాసి అచ్చేయించిన కాగితాలని వేశారు.

మంటలు మరింత పెద్దవయ్యాయి.

ప్రక్కకి చూశారు.

ఒక మహిళ–చెల్లెల్లాంటి మహిళ–

ఆమె నుదుట వెలుగుతున్న కుంకుమ బొట్టుని చూసి అనుకున్నారు "అర్ధరాత్రి సూర్యోదయ మయ్యిందని పద్యాలు రాస్తాను చెల్లీ. విజయం నీదే నీదే. సారాసుర మర్దనీ! జయహే!"

* * *

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక. 9-4-1993)**